## అధికారులు సూచించిన విత్తనాలు, ఎరువులను వాడాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో శ్రావణ్ కుమార్

బాన్సువాడ టౌన్, మే 23 : వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సూచించిన ఎరువులు, విత్తనాలనే రైతులు కొనుగోలు చేయాలని బీర్కూర్ ఏఈవో శ్రావణ్ కుమార్ తెలిపారు. బీర్కూర్‌లోని వ్యవసాయ కార్యాలయంలో గురువారం విత్తనాలపై రైతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఈవో మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ నుంచి లైసెన్స్ పొందిన డీలర్ వద్దనే రైతులు విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులను కొనుగోలు చేయాలని సూచించారు. డీలర్ స్టాంప్, సంతకం చేసిన రసీదును తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఏదైనా అనుమానం వస్తే వెంటనే సంబంధిత వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు.

## రైతులకు అందుబాటులో జీలుగ విత్తనాలు

రాజంపేట్, మే 23 : మండలంలోని ఆర్గొండ ప్రాథమిక సహకార సంఘంలో రైతులకు జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారిణి సుప్రజ్యోతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జీలుగ విత్తనాలు 30 కిలోల బస్తా ధర రూ.2,790 కాగా సబ్సిడీ రూ.1,674 పోను రైతులు రూ.1,116 చెల్లించాలన్నారు. అవసరమైన రైతులు శుక్రవారం నుంచి పట్టా పాసు పుస్తకం, ఆధార్ కార్డు తీసుకొని ఏఈవో దగ్గర పర్మిట్ రాయించుకొని విత్తనాలను తీసుకెళ్లాలని ఆమె సూచించారు.

## గాంధారి మండలంలో..

గాంధారి, మే 23: జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి నరేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధారి, ముదెల్లి సింగిల్ విండో కార్యాలయాలతోపాటు మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో జీలుగ విత్తనాలు విక్రయానికి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. రూ.2,790 విలువైన 30 కిలోల జీలుగ బస్తాను 60 శాతం రాయితీపై రూ.1,116 అందజేస్తున్నట్లు తెలిపారు. అవసరం ఉన్న రైతులు తమ పట్టాపాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాలను ఏఈవోలకు అందజేసి పర్మిట్ పొందాలని సూచించారు.

## రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

మాచారెడ్డి, మే 23 : మండలంలోని చుక్కాపూర్ గ్రామశివారులో పాల్వంచ వాగు ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక ను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు చేయగా రెండు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## అనుమతి లేని పాఠశాలలను మూసి వేయాలి

కామారెడ్డి, మే 23 : జిల్లా కేంద్రంలో అనుమతి లేని పాఠశాలలను మూసివేయాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంపల్ స్కూల్‌ను కొనసాగించడానికి ఎలాంటి అనుమతి లేదని తేల్చి చెప్పినా ఎంఈవో మాటలు లెక్క చేయకుండా అడ్మిషన్ ప్రక్రియను కొనసాగిస్తున్నారని ఆరోపించారు. వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు రోహిత్, ఖలీల్, నవీన్, రాజు, అల్తాఫ్, వరణ్ పాల్గొన్నారు.

# ఓవర్ లోడ్ టిప్పర్లతో రోడ్డు ధ్వంసం

- ప్రమాదాలబారిన పడుతున్న వాహనదారులు
- చోద్యం చూస్తున్న అధికారులు
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారంటూ గ్రామస్తుల ఆగ్రహం



భవానీపేట గ్రామంలో ధ్వంసమైన రోడ్డు

మాచారెడ్డి, మే 23 : పాల్వంచ మండలం భవానీపేట గ్రామంలోని జక్కుల చెరువు నుంచి టిప్పర్లతో అక్రమంగా నల్లమట్టిని తరలిస్తుండడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. అధిక లోడ్‌తో టిప్పర్లు వెళ్తుండడంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓవర్‌లోడ్‌తో టిప్పర్లు ఉదయం నుంచి రాత్రి వరకు తిరగడంతో రోడ్డు పూర్తిగా గుంతలుగా మారిందన్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు అంటున్నారు. ఇటీవల గ్రామస్తులు రాత్రి సమయంలో వాహనదారులు గుంతలో పడి గాయాలపాలయ్యారని తెలిపారు. పెద్ద ప్రమాదం జరిగితేనే ఉన్నతాధికారులు స్పందిస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధిక లోడ్‌తో చెరువు నుంచి నల్లమట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

భిక్కనూరు, మే 23 : మండలంలోని గుర్జకుంట గ్రామానికి చెందిన మాజీ వార్డు మెంబర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వడ్డే వెంకటి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ బాధిత కుటుంబ సభ్యులకు స్థానిక బీఆర్ఎస్ నాయకుల ద్వారా రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని గురువారం అందించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు దాసరి గోపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు రమేశ్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు పుట్ట రమేశ్, భూపాల్, గంగారెడ్డి, రవీందర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, భిక్షపతి, మల్లారెడ్డి, బాల్‌రెడ్డి, నర్సింహులు, మహేందర్‌రెడ్డి, రాజిరెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

## మినీ వాటర్‌ట్యాంక్ ప్రారంభం

మాచారెడ్డి, మే 23 : మండలంలోని కొత్తపల్లి గ్రామంలో నీటి సమస్య ఉందని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌కు గ్రామస్తులు తెలపడంతో ఆయన సొంత డబ్బులు రూ.50 వేలతో మినీ వాటర్ ట్యాంకర్ నిర్మించారు. జడ్పీటీసీ మినుకూరి రాంరెడ్డి వాటర్ ట్యాంక్‌ను గురువారం ప్రారంభించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పగడాల బాల్‌చంద్రం, శ్రీకాంత్‌రెడ్డి, గోవింద్‌రెడ్డి, బట్ట రమేశ్, ఎల్లయ్య, శ్రీనివాస్, ఐలయ్య, బాబు, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



మినీ వాటర్ ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## వైభవంగా లక్ష్మీనృసింహుడి కల్యాణం



లక్ష్మీనర్సింహుని కల్యాణం నిర్వహిస్తున్న పండితులు



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

చారెడ్డి, మే 23 : మండలంలోని చుక్కాపూర్ అటవీ ప్రాంతంలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణాన్ని గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించడానికి జిల్లా నలుమూలల నుంచే కాకుండా సరిహద్దు జిల్లాలైన కరీంనగర్, సిద్దిపేట, రాజన్నసిరిసిల్ల, నిజామాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. కట్నకానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఆలయం తరపున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ శనిగరం కమలాకర్‌రెడ్డి, ఈవో శ్రీధర్‌రావు తెలిపారు. కల్యాణం అనంతరం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో లక్ష్మీనృసింహున్ని రథంపై ఊరేగించారు. ఆలయ ప్రాంగణం నర్సింహ నామంతో మార్మోగింది.

## ఈ సెట్‌లో రాష్ట్ర స్థాయిలో 15వ ర్యాంక్



అశృత

భిక్కనూరు, మే 23 :ఇటీవల విడుదలైన ఈ సెట్ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన అశృత రాష్ట్రస్థాయిలో 15వ ర్యాంక్ సాధించింది. మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బచ్చ గారి దయానంద్, కిర్మాయిల కూతురు అశృత హైదరాబాద్‌లోని కమలా నెహ్రూ పాలిటెక్నిక్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ కోర్సు పూర్తి చేసింది. ఇంజినీరింగ్ చదివేందుకు ఈ సెట్ ప్రవేశ పరీక్ష రాసింది. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

దోమకొండ, మే 23: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ శారద అధ్యక్షతన శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## ఘనంగా నవదుర్గా వ్రతం

కామారెడ్డి, మే 23 : జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఉన్న శారదాదేవి ఆలయంలో గురువారం పౌర్ణమి సందర్భంగా సామూహిక నవదుర్గా మహావ్రతం, మంగళ హారతి, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## జీవ వైవిధ్య పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

బీబీపేట, మే 23 : తెలంగాణ జీవ వైవిధ్య బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో జడ్పీహెచ్ఎస్ మాందాపూర్ విద్యార్థులు పాల్గొని మొదటి స్థానంలో నిలిచారు. జీవ వైవిధ్యం, ప్రకృతి పరిరక్షణ మనందరి బాధ్యత అని వివరించడంతో విద్యార్థులు అందరి మన్ననలు పొందారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వాణి ప్రసాద్ ఐఏఎస్ (ప్రిన్సిపల్ సెక్రటరీ), మోహన్ చంద్ర ఐఎఫ్ఎస్, డీఎఫ్‌వో జోజి తదితరుల చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. అవార్డులు అందుకున్న విద్యార్థులు టీ.దీపిక, సీహెచ్ శ్రీనిధి, పీ.సాహితి, బీ.అర్చన ఉన్నారు. వీరికి గైడ్ టీచర్లుగా శ్రీనివాస్, బాబు, కృష్ణ తదితరులు ఉన్నారు.



జీవ వైవిధ్య పోటీలకు ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న అధికారులు

## ప్లాస్టిక్ బ్యాగులు వాడితే కఠిన చర్యలు

ఎల్లారెడ్డి, మే 23: ప్లాస్టిక్ బ్యాగులను వాడితే కఠిన చర్యలు తప్పవని మున్సిపాలిటీ సిబ్బంది పట్టణంలోని పలు దుకాణాల యజమానులకు హెచ్చరించారు. స్థానిక బల్దియా కమిషనర్ శ్రీహరిరాజు ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది గురువారం పలు దుకాణాల యజమానులతో మాట్లాడారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఇప్పటికే బల్దియా పరిధిలో ప్లాస్టిక్ బ్యాగుల నిషేధం ఉన్నదని, అయినా కొందరు వినియోగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎవరైనా ప్లాస్టిక్ బ్యాగులను వినియోగిస్తే జరిమానా విధించడంతోపాటు కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు.

## మండల సమావేశం వాయిదా




సమావేశం వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న ఎంపీడీవో

పెద్దకొడప్‌గల్, మే 23: పెద్దకొడప్‌గల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో సూర్యకాంత్ తెలిపారు. గురువారం ఉదయం సమావేశాన్ని నిర్వహించగా.. ఎంపీటీసీ సభ్యులు, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, పలు శాఖల అధికారులు హాజరు కాలేదు. ముందే సమాచారం అందించినా సభ్యులు హాజరు కాలేదని, దీంతో సమావేశాన్ని వాయిదా వేశామని ఎంపీడీవో తెలిపారు. సమావేశానికి తహసీల్దార్ దశరథ్, వైస్ ఎంపీపీ బోధనం లక్ష్మి హాజరయ్యారు.

## విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

ఎల్లారెడ్డి, మే 23: ఎల్లారెడ్డిలో బుధవారం రాత్రి ఈదురుగాలులు, వానకు ఎర్రమన్నుకుచ్చ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో విషయాన్ని స్థానిక కౌన్సిలర్ శ్రీనివాస్ విద్యుత్ సిబ్బందికి తెలిపారు. ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది గురువారం ఉదయమే అక్కడికి చేరుకొని విద్యుత్ స్తంభాలను సరిచేశారు. మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. పనులు వెంటనే పూర్తి చేసిన ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బందితోపాటు వార్డు కౌన్సిలర్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

**CHANGE OF NAME**

★I, AMRAJ THIRUPATHI S/O AMRAJ NARAYANA,H.NO:3-1,KAMMARPALLY, NZB(D).CHANGED MY SURNAME AS AMRAJI THIRUPATHI S/O AMRAJI NARAYANA
NTZ-324688

**WANTED**

★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663.
NT-327722-All




**పాస్‌పోర్ట్ పోయినది**

★KATTE SRINIVAS SWAMY, R/O BHEEMGAL NZB(D). నా యొక్క పాస్‌పోర్ట్ నెం. 9546543. నిజామాబాద్ నుండి భీమ్‌గల్‌కు ఆటోలో వెళ్లుచుండగా పోయినది. దొరికినవారు Pls Call: 9505025232
NTZ-324690

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# ‘ఉపాధి’ కొలతలు పక్కాగా నమోదు చేయాలి



కూలీలకు సూచనలు ఇస్తున్న బిచ్కుంద ఎంపీడీవో గోపాల్

బిచ్కుంద, మే 23: ఉపాధి హామీ పథకంలో చేసిన పనుల కొలతలను పక్కాగా నమోదు చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో గోపాల్ ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. మండలంలోని రాజుల్లా గ్రామాన్ని ఆయన గురువారం సందర్శించారు. గ్రామంలోని పల్లె ప్రకృతివనం, కంపోస్ట్ షెడ్డును పరిశీలించారు. అనంతరం ఉపాధి కూలీలు చేపడుతున్న ఫీడర్ చానల్ పనులను తనిఖీ చేశారు. కూలీలతో మాట్లాడి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీవో మహబూబ్ తదితరులు ఉన్నారు.

***ఉపాధి పనుల పరిశీలన..***

రామారెడ్డి, మే 23: మండల కేంద్రంలోని మేలకుంటలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఏపీవో ధర్మారెడ్డి గురువారం పరిశీలించారు. కూలి గిట్టుబాటు కావాలంటే కొలతల ప్రకారం పనులు చేపట్టాలని కూలీలకు సూచించారు. ఎండ తీవ్రంగా ఉన్నందున షేడ్ నెట్ల కింద సేద తీరాలన్నారు. కూలీలకు తాగు నీరు అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి క్రాంతికుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ రజిత తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు పూర్తి

ఎల్లారెడ్డి, మే 23: మండలంలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి అయ్యాయని తహసీల్దార్ మహేందర్‌కుమార్ తెలిపారు. మండలంలోని లింగారెడ్డిపేట, మత్తమాల గ్రామాల్లో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని రుద్రారం మినహా అన్ని గ్రామాల్లో ధాన్యం సేకరించడం గురువారం సాయంత్రంతో ముగిసిందన్నారు. ఒక్క రుద్రారం గ్రామంలోనే ధాన్యం ఎక్కువగా ఉన్నందున కొనుగోలు కేంద్రాన్ని కొనసాగిస్తామని తెలిపారు. అక్కడ కూడా రెండు రోజుల్లో కొనుగోళ్లు ఉంటాయన్నారు. రైతులు తమ ఇండ్ల వద్దనే ధాన్యం నిల్వ ఉంచడంతో తూకం వేయడంలో ఆలస్యం జరిగిందని తెలిపారు. ఆయనవెంట గిర్దావర్ శ్రీనివాస్ ఉన్నారు.



కొనుగోళ్లను పరిశీలిస్తున్న తహసీల్దార్

## దొడ్డు వడ్లకూ బోనస్ అందించాలి

నారెడ్డిపేట, మే 23: రాష్ట్ర ప్రభుత్వం దొడ్డు వడ్లకు కూడా రూ.500 బోనస్ అందించాలని జడ్పీటీసీ సభ్యుడు ఉమ్మన్నగారి మనోహర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని మంత్రులు ప్రకటించడం సరికాదన్నారు. రైతులు అత్యధికంగా దొడ్డు రకం ధాన్యాన్ని పండిస్తారని తెలిపారు. ప్రభుత్వం ఈ విషయాన్ని గుర్తించి దొడ్డు వడ్లకు కూడా బోనస్ అందించాలని, లేనిపక్షంలో రైతుల తరపున ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు.

## ఎల్లారెడ్డిలో లార్వా సర్వే



నిల్వ నీటిని పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

ఎల్లారెడ్డి రూరల్, మే 23: ఎల్లారెడ్డి పట్టణంలో డెంగీతో బాలుడు మృతి చెందడంతో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం లార్వా సర్వే నిర్వహించారు. పట్టణంలోని ధోబీ గల్లిలో ఇంటింటికీ తిరిగిన జిల్లా మలేరియా బృందం సభ్యులు, వైద్య సిబ్బంది మలేరియా నివారణపై, నిలువనీరు ఉండకుండా తీసుకునే చర్యలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా బృందం సభ్యులు శ్రీనివాస్‌రావు, శివయ్య, సబ్‌యూనిట్ అధికారి రామారావు, మత్తమాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు శరత్‌కుమార్, హెచ్‌ఈవో త్రివిక్రమాచారి, ఏఎన్ఎం ఇందిర, ఆశకార్యకర్తలు సంధ్య, లావణ్య, సవిత, హెల్త్ ఎడ్యుకేటర్ దస్తీరాం తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి ఆయిల్ చోరీ




నాగిరెడ్డిపేట, మే 23: మండలంలోని తాండూర్ శివారులోని మూడు ట్రాన్స్‌ఫార్మర్లను దుండగులు గురువారం ధ్వంసం చేశారు. వాటిలోని కాపర్ వైరు, ఆయిన్‌ను చోరీ చేశారు. పంట పొలాలకు వెళ్లిన రైతులు గమనించి విద్యుత్ శాఖ అధికారులు, పోలీసులకు సమాచారం అందించారు. సుమారు రూ.మూడు లక్షల నష్టం వాటిల్లిందని లైన్‌మెన్ బాలకిషన్, మన్సూర్ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజు తెలిపారు.

## ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన



రోగిని పరీక్షిస్తున్న హరికిషన్‌రావు

ఎల్లారెడ్డి రూరల్, మే 23: ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, లయన్స్ క్లబ్ ఆఫ్ బాన్సువాడ ఆధ్వర్యంలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆప్తాలమిస్ట్ హరికిషన్‌రావు తదితరులు 67 మంది రోగులను పరీక్షించారు. వారిలో 12 మందికి మోతిబిందు ఉన్నట్లు గుర్తించారు. తీవ్ర కంటి సమస్యలు ఉన్న ఇద్దరిని సరోజిని దేవి కంటి దవాఖానకు రిఫర్ చేశారు. దవాఖాన సూపరింటెండెంట్ రవీంద్రమోహన్, దవాఖాన సిబ్బంది పాల్గొన్నారు.

## లక్ష్మీనారాయణ మందిరంలో రథోత్సవం

మద్నూర్, మే 23: మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ మందిరంలో గురువారం రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## పెద్దమ్మకు బోనాల సమర్పణ



బోనాలను తీసుకెళ్తున్న మల్లయ్యపల్లి గ్రామస్తులు

ఎల్లారెడ్డి రూరల్, మే 23: మండలంలోని మల్లయ్యపల్లిలో ఉన్న పెద్దమ్మకు గ్రామస్తులు గురువారం బోనాలను సమర్పించారు. ప్రతి ఇంటి నుంచి బోనాలను ర్యాలీగా ఆటపాటలతో ఆలయం వరకు తీసుకెళ్లారు. అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భువనగిరి ఎల్లయ్యతోపాటు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పీడీఎస్‌యూ నాయకులపై కేసులు ఎత్తివేయాలి




నిరసన వ్యక్తం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

గాంధారి, మే 23: తమ నాయకులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని కోరుతూ గాంధారిలో పీడీఎస్‌యూ నాయకులు గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సతీశ్ మాట్లాడుతూ.. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌రెడ్డిపై పెట్టిన కేసును ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే విద్యార్థులపై ఉన్న కేసులను ఎత్తివేస్తామని తెలిపి, ఇప్పుడు విద్యార్థి సంఘాల నాయకులపై కేసులు పెడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు మోజీరామ్, నాయకులు సుమన్, ప్రవీణ్, భాను తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీకి పాముకాటు

ఎల్లారెడ్డి రూరల్, మే 23: మండలంలోని లక్ష్మాపూర్ గ్రా మ చెరువులో గురువారం ఉపాధి పనులు చేస్తున్న సమయంలో రఘు అనే కూలీకి పాము కాటువేసింది. వెంటనే ఫీల్డ్ అసిస్టెంట్ బాధితుడిని ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తీసుకువచ్చాడు. విషయం తె లుసుకున్న స్థానిక నాయకులు కుర్మ సాయిబాబా, గోపీకృష్ణ బాధితుడిని పరామర్శించారు. మెరుగైన వైద్య సేవల కోసం ఎమ్మెల్యే మదన్‌మోహన్ ట్రస్ట్ అంబులెన్స్ ద్వారా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటకు తరలించారు. అతడి పరిస్థితి నిలకడగా ఉన్నదని గ్రామస్తులు తెలిపారు. సకాలంలో స్పందించిన నాయకులతోపాటు ఎమ్మెల్యేకు లక్ష్మాపూర్ గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎల్లారెడ్డిలో బుద్ధ పౌర్ణిమ

ఎల్లారెడ్డి రూరల్, మే 23: ఎల్లారెడ్డిలో బుద్ధపౌర్ణమిని గురువారం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అట్కారి బబ్లూ మాట్లాడుతూ.. బుద్ధుడు చూపిన మార్గంలో నడవాలని, శాంతిని కోరుకోవాలన్నారు. సాయిలు, సాయిబాబు, చిరంజీవి, గౌతం తదితరులు పాల్గొన్నారు.

## యువకుడి అదృశ్యం

కామారెడ్డి, మే 23 : కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డికి చెందిన కూలీ పని చేసుకునే ఒంటెద్దు సాయిలు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పట్టణ సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 16వ తేదీ ఉదయం 7 గంటలకు కామారెడ్డి రైల్వేస్టేషన్ వద్ద తన బండిని అన్న కొడుకు అయిన శ్యాంకు అప్పజెప్పి రెండు, మూడు రోజుల్లో వస్తానని చెప్పి తిరిగి రాలేదన్నారు. సాయిలు ఎడమ చేతిపై అమ్మ అనే పచ్చబొట్టుతోపాటు కుడి చేయి భుజంపై లవ్ సింబల్‌తో రెజీనా అనే పేరుతో పచ్చబొట్టు ఉందని తెలిపారు. భార్య ఒంటెద్దు అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.